సొంతింటి కల నెరవేరిన వేళ

- పాలకొల్లులో పేదల కష్టాన్ని తీర్చిన తండ్రీకొడుకులు
- కోట్లాది రూపాయలు వెచ్చించి భూముల కొనుగోలు
- టీడీపీ హయాంలో సెంటు భూమి కూడా కొనని వైనం


ఆకులవాని గరువు లేఅవుట్ 3లో నిర్మాణాలు చేసుకుంటున్న లబ్ధిదారులు


లేఅవుట్ 3లో ఇళ్లు నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారుడు

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్రంలో పేద బడుగు బలహీన వర్గాల కుటుంబాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఒక కుటుంబ సభ్యుడిగా వారి హృదాయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. పేద ప్రజల కష్టాలను గుర్తించి వారి సొంతింటి కలను నెరవేర్చాలనే సంకల్పంతో గతంలో పాలకొల్లు పట్టణంలో దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి 70 ఎకరాలు భూమిని కొనుగోలు చేయిస్తే నేడు ముఖ్యమంత్రి హోదాలో తండ్రికి తగ్గ తనయునిగా మరింత మంది పేదలకు సొంతింటి కల నెరవేర్చాలనే సంకల్పంతో నియోజకవర్గంలో 135 ఎకరాలు భూమిని కొనుగోలు చేయించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని లబ్ధిదారులు చెబుతున్నారు. 2007లో వైఎస్ రాజశేఖరరెడ్డి పట్టణంలో పెంకుళ్ల పాడు, పెదగరువు, రామయ్యహాలు ప్రాంతాల్లో సుమారు 70 ఎకరాలు భూమిని కొనుగోలు చేయించారు. అప్పటి లబ్ధిదారులకు స్థలాలు కేటాయించినా మౌలిక వసతులు మాత్రం 2022లో కల్పించడం గమనార్హం. ముఖ్యంగా రామయ్యహాలు కాలనీ వాసులకు విద్యుత్ కూడా 2022లో జగనన్న ప్రభుత్వమే కల్పించిందంటే గత టీడీపీ పాలన ఎంత అధ్వానంగా ఉందో ఈ ప్రాంతం చూస్తే అర్థం అవుతుంది. ప్రతి లబ్ధిదారునికి సెంటున్నర భూమిని కేటాయించేలా నాడు కొనుగోలు చేశారు. వైఎస్సార్ మరణాంతరం లబ్ధిదారుల సంఖ్య పెరగడంతో కనీసం గజం స్థలం కూడా కొనలేని నాటి కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు రాజశేఖరరెడ్డి కొనుగోలు చేసిన స్థలాలనే జీప్లస్ 1, టిడ్కో గృహాల పేరున జీప్లస్ 3 ప్రకారం నిర్మాణం చేసి సుమారు 7144 మందికి కేటాయించారు. ఆ టిడ్కో గృహాలు కూడా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే లబ్ధిదారులకు ఇవ్వడం గమనార్హం.

రూ. 60 కోట్ల వ్యయంతో 135 ఎకరాల కొనుగోలు

సొంతింటి కల నెరవేర్చుకోవాలనే ఆశతో లబ్ధిదారులు ఎవరైనా ఇంటి స్థలానికి దరఖాస్తులు చేస్తుంటే గత ప్రభుత్వాలు జీ-ప్లస్ అంటూ అంతస్తులను పెంచారే తప్ప గజం స్థలం కూడా కొనుగోలు చేసిన దాఖలాలు లేవు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత లబ్ధిదారుల సంఖ్య పెరగడంతో వారికి సొంతింటి కల నెరవేర్చాలనే ఉద్దేశంతో నియోజకవర్గంలో భూమిని కొనుగోలు చేయాలని నిర్ణయించింది. వెంటనే ప్రభుత్వం నియోజకవర్గంలో సుమారు 135 ఎకరాలు భూమిని కొనుగోలు చేయించింది. పాలకొల్లు మండలం శివదేవుని చిక్కాలలో 38 ఎకరాలు, పాలకొల్లు పట్టణానికి సంబంధించి యలమంచిలి మండలంలో ఆకులవాని గరువు కొంతేరు లే అవుట్ 1లో 12.95 ఎకరాలు, ఆకులవాని గరువు కాజ లే అవుట్ 2లో 29.87 ఎకరాలు, ఆకులవాని గరువు మేడపాడు లే అవుట్ 3లో 7.36 ఎకరాలు, ఆకులవాని గరువు కొంతేరు శివారు లే అవుట్ 4లో 4.92 ఎకరాలు, యలమంచిలి మండలంలో 41.26 ఎకరాలు భూమిని కొనుగోలు చేశారు. సుమారు రూ. 60 కోట్ల వ్యయంతో మొత్తం 135 ఎకరాలు భూమిని లబ్ధిదారుల కొరకు కొనుగోలు చేయించారు. ఇవి కాకుండా పాలకొల్లు మండలంలో పంచాయితీ స్థలాలు ద్వారా 14.50 ఎకరాలు, అలాగే యలమంచిలి మండలంలో పంచాయితీ స్థలాలు ద్వారా 6.40 ఎకరాలు భూమిని కేటాయించారు. వీటి ద్వారా పాలకొల్లు మండలంలో 2187 మంది, పట్టణంలో 2827 మంది, యలమంచిలి మండలంలో 1772 మంది లబ్ధిదారులు మొత్తం 6786 మందికి ఇళ్ల స్థలాలను కేటాయించారు.

నాడు లబ్ధిదారుల నుంచి డబ్బుల వసూళ్లు

గత టీడీపీ ప్రభుత్వంలో టిడ్కో గృహాలు నిర్మాణం చేస్తున్నామంటూ రూ.500, రూ. 50 వేలు, రూ 1 లక్షలు లబ్ధిదారుల నుండి కేటగిరీల వారీగా వసూళ్లు చేశారు. అంతేకాకుండా ఆ లబ్ధిదారులను బ్యాంకుల్లో తాకట్టు పెట్టించి సుమారు 20 ఏళ్ల వారిని రుణగ్రస్తులను చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత టిడ్కో ఇళ్ల 300 చ.అ గృహాలను కేవలం రూపాయికే అందించగా 370 చ.అ ఫ్లాట్లు, 430 చ.అ ఫ్లాట్లకు కట్టిన రూ. 50 వేలు, లక్ష రూపాయలకు 50 శాతం సబ్సిడీని కల్పించింది. అంతే కాకుండా నూతనంగా కొనుగోలు చేసిన భూములను లబ్ధిదారులకు కేటాయించి సుమారు రూ. 1.80 లక్షలు లోన్లు మంజూరు చేసి ఇళ్ల కట్టుకోవడానికి ప్రభుత్వం ఆసరాగా నిలబడింది.

త్వరలో ఇంటి నిర్మాణం పూర్తి



మాకు సొంతిల్లు లేదు. ప్రస్తుతం అద్దెకు ఉంటున్నాం. ప్రస్తుత పరిస్థితుల్లో అద్దెలు చెల్లించడమంటే భారంగానే అనిపిస్తుంది. జగనన్న కాలనీల్లో మేడపాడు లే అవుట్-3లో స్థలం మంజూరైంది. ఇళ్లు నిర్మించుకోవడానికి ప్రభుత్వం లోన్లు కూడా మంజూరు చేస్తుంది. త్వరలో ఇంటి నిర్మాణం పూర్తిచేసుకుని సొంతింటికల నెరవేర్చుకోవాలని అనుకుంటున్నాం. జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత మాకు స్థలం ఏర్పడింది. సొంతింటికల నెరవేరనుంది.

దాసరి దివ్యశ్రీ, గృహిణి, పాలకొల్లు

జగనన్న మేలు మర్చిపోలేం



మాకు కొంతేరు లేఅవుట్ 2లో స్థలం మంజూరైంది. స్థలం ఉంటే మనకి నచ్చిన విధంగా నిర్మాణం చేసుకోవచ్చు. చాలా మంది మాకు టిడ్కో గృహాల్లో ఇల్లు వచ్చింది. అది తీసుకుని స్థలం ఇస్తారా? అని మార్పులకు అడుగుతున్నారు. ముందు టిడ్కో గృహాలే మెరుగని అనుకున్నాం. కాని స్థలం అయితేనే బాగుంటుందని బంధువులు, మిత్రులు చెప్పడంతో స్థలానికే ప్రాధాన్యత ఇచ్చాం. జగనన్న మేలు మర్చిపోలేము.

- వేంద్ర నాగదుర్గ, గృహిణి, పాలకొల్లు

క్లుప్తంగా

వేగంగా రహదారి నిర్మాణ పనులు


కాళీపట్నం పడమరలో నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్డు

మొగల్తూరు: మండలంలోని కాళీపట్నం పడమర నుంచి పాతపాడు గ్రామం వరకూ చేపట్టిన సీసీ రోడ్డు పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. కాళీపట్నం కాలువపై గతంలో నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరడంతో వంతెనను తొలగించి నూతనంగా రెండు లైన్ల వంతెన నిర్మాణం, అలాగే కాళీపట్నం నుంచి పాతపాడు వరకు సీసీ రోడ్డు నిర్మాణం కోసం రూ.12 కోట్లు మంజూరయ్యాయి. దీంతో గత ఏడాది పనులు చేపట్టి ముందుగా రెండు లైన్ల వంతెన నిర్మాణం పూర్తి చేశారు. ఇక మిగిలిన రోడ్డు పనుల్లో కాళీపట్నం వంతెన నుంచి స్థానిక శివాలయం వరకూ రహదారి నిర్మాణం పూర్తి కాగా, మిగిలిన పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నారు.

వైభవంగా వెంకన్న కల్యాణం


వేంకటేశ్వరస్వామి తిరు కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక కెనాల్ రోడ్డు గాంధీ బొమ్మల సెంటర్ వద్ద కొలువై ఉన్న శ్రీ భూనీళా సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి తిరు కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. బుధవారం రాత్రి గోవర్ధనం శోభనాద్రి ఆచార్యుల బ్రహ్మత్వంలో గ్రంధి మురళీకృష్ణ దంపతులు స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం భక్తులకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రధానార్చకులు మరుధూరి నరసింహాచార్యులు తదితరులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ముమ్మరంగా ఉపాధి పనులు

మొగల్తూరు: మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కాళీపట్నం తూర్పు, కేపీ పాలెం నార్త్, సౌత్, పేరుపాలెం నార్త్, మొగల్తూరు పంచాయతీలోని నక్కావారిపాలెం, ఇంజేటివారిపాలెం, పాలకమ్మచెరువు, శేరేపాలెం గ్రామాల్లో పంట బోదె తవ్వకం పనులు చురుగ్గా సాగుతున్నాయి. గురువారం మండలంలోని కాళీపట్నం తూర్పులో చేపట్టిన పంటబోదె పనులతో పాటు కూలీల మస్తర్లను జేఈ ఆనంద్ పరిశీలించి ఉపాధి కూలీలకు పలు సూచనలు చేశారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు


సరిపల్లి గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నరసాపురం రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సీఐ కె.గోవిందరాజు, ఎస్సై గుర్రయ్య అన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో పోలీసులు కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా లిఖితపూడి, సరిపల్లి గ్రామాల్లో పోలీసు కవాతు నిర్వహించారు. సరిపల్లి గ్రామ సెంటర్ నుంచి ప్రధాన రహదారి మీదుగా ఈ పోలీసు కవాతు కొనసాగింది. అనంతరం సరిపల్లి సెంటర్ నిర్వహించిన సభలో సీఐ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలంతా సహకరించాలన్నారు. కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ సిబ్బంది జర్నైల్ సింగ్, రామన్‌జీ తదితరులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా దాళ్వా సాగు

మొగల్తూరు: సాగు పనులు ఆలస్యంగా చేపట్టినా దాళ్వా సాగు ఆశాజనకంగా ఉంది. ప్రతి ఏటా జనవరి నెలాఖరుకు నాట్లు వేయడం పూర్తి కాగా ఈ ఏడాది వాతావరణం కారణంగా ఫిబ్రవరి నెల వరకూ నాట్లు వేస్తూనే ఉన్నారు. మొగల్తూరు మండలంలో సుమారు 1190 ఎకరాల్లో దాళ్వా నాట్లు పూర్తయ్యాయని వ్యవసాయ శాఖాధికారులు అంచనా వేశారు. రైతులు ఎక్కువగా 125 నుంచి 140 రోజుల్లో పంట చేతికోచ్చే 1121, 1156, 1153, పీఆర్-121 రకం విత్తనాలను వినియోగంచడంతో అందుకు అవసరమయ్యే ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉంచామని అధికారులు పేర్కొంటున్నారు. రైతు భరోసా కేంద్రాల్లోని సిబ్బంది రైతులకు సలహాలు, సూచనలు అందించేందుకు సిద్ధంగా ఉన్నారని ఏఓ రహీమ్ తెలిపారు.

నేడు వడ్లవానిపాలెంలో గుడాల గోపి ఎన్నికల ప్రచారం

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) శుక్రవారం మండలంలోని వడ్లవానిపాలెం గ్రామంలో ఉదయం 8 గంటల నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ పార్టీ మండల కన్వీనర్ విప్పర్తి ప్రభాకరరావు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రచారంలో పాల్గొనాలని ఆయన కోరారు.

మార్కెట్ పన్ను వసూళ్ల వేలం వాయిదా

నరసాపురం: 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మున్సిపాలిటీలో డైలీ మార్కెట్ పన్ను వసూళ్లపై హక్కులు కల్పించేందుకు గురువారం నిర్వహించిన బహిరంగ వేలం వాయిదా పడింది. ధరావత్తు చెల్లించిన ఆరుగురు పాటదారులు హాజరైనా కానీ ఎవరూ పాటలో పాల్గొనలేదు. దీంతో వేలాన్ని ఈ నెల 27 వాయిదా వేసినట్టు మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు ప్రకటించారు. గతేడాది పాట రూ.74 లక్షలకు వెళ్లింది. ఈ సారి పాటదారులు సిండికేట్ అయ్యినట్టుగా పట్టణంలో ప్రచారం సాగుతోంది.

25న కేశవస్వామి ఆలయ పునః ప్రతిష్ఠ

కాళ్ల: మండలంలోని దొడ్డనపూడి గ్రామంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కేశవ స్వామి వారి ఆలయ పునః ప్రతిష్ఠ కార్యక్రమం ఈనెల 25వ తేదీన నిర్వహించినట్లు ఆలయ ఈవో శ్రీనివాసరాజు గురువారం తెలిపారు. దీనిలో భాగంగా గురువారం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు హోమాలు నిర్వహిస్తున్నట్లు స్పష్టం చేశారు. 25వ తేదీన ఉత్తర నక్షత్ర యుక్త మేష లగ్నం అందు ప్రతిష్ఠ హోమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు గ్రామ పెద్దలు పెద్ద ఎత్తున హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

మేకా శేషబాబుకు కృతజ్ఞతలు


మేకా శేషబాబుకు కృతజ్ఞతలు చెబుతున్న సగం చెరువు గ్రామ పెద్దలు

పాలకొల్లు అర్బన్: మండలంలోని సగంచెరువులో శ్రీ కోదండరామాలయం అభివృద్ధికి తిరుమల తిరుపతి దేవస్థానం నిధులు రూ.10 లక్షలు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా ఆ గ్రామ శ్రీ కోదండరామాలయం కమిటీ సభ్యులు టీటీడీ పాలక మండలి సభ్యులు మేకా శేషబాబుని గురువారం ప్రత్యేకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. శేషబాబు మాట్లాడుతూ గ్రామాల్లో జీర్ణోద్ధరణ చెందిన రామాలయాలు, అమ్మవార్ల ఆలయాల మరమ్మతులకు టీటీడీ నుంచి నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. సంబంధిత ఆలయాల వివరాలను తన దృష్టికి తీసుకువస్తే నిధులు మంజూరు చేయించడానికి కృషి చేస్తానన్నారు.

చింతలపాలెం డ్రెయిన్ పనుల పూర్తి


నడిపూడి చింతలపాలెంలో నిర్మించిన డ్రెయిన్

పెనుగొండ: మండలంలోని నడిపూడికి చెందిన చింతలపాలెం మురుగు సమస్యకు మోక్షం కలిగింది. రూ.25 లక్షల జిల్లా పరిషత్ నిధులతో చేపట్టిన డ్రెయినేజీ నిర్మాణం పూర్తయ్యింది. 15 సంవత్సరాలుగా డ్రెయినేజీ సమస్యతో ప్రజలు సతమతమయ్యేవారు. దీంతో అధికారులు, ప్రజా ప్రతినిధులు చుట్టూ ప్రదిక్షణలు చేశారు. దీంతో నడిపూడిలో మాజీ మంత్రి, ఆచంట శాసన సభ్యులు చెరుకువాడ శ్రీరంగనాథరాజు పర్యటించినపుడు ఆ ప్రాంత మహిళలు మురుగు సమస్యను విన్నవించుకున్నారు. సమస్య పరిష్కారం కోసం ముందుగా కచ్చా డ్రెయినేజీ నిర్మాణం చేపట్టారు. ముందుగా మురుగు సమస్య తాత్కాలికంగా పరిష్కరించడానికి కచ్చా డ్రయిన్ తవ్వించారు. అనంతరం జిల్లా పరిషత్ నిధులు నుంచి రూ.25 లక్షలు మంజూరు చేయించారు. నిధుల మంజూరు కావడంతో ఇటీవలే నిర్మాణం చేపట్టి పూర్తి చేశారు. సుమారు 600 మీటర్ల మేర ఇరువైపులా డ్రెయినేజీ నిర్మాణం నెల రోజులుగా చేసి ఇటీవలే పూర్తి చేశారు. దీంతో మురుగు సమస్య శాశ్వతంగా పరిష్కారమైందంటూ చింతల పాలెం ప్రజలు ఆనందం వ్యం చేస్తున్నారు. డ్రెయినేజీ సమస్యను పరిష్కరించిన శాసన సభ్యుడు శ్రీరంగనాథరాజు, స్థానిక నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

జగనన్న పాలనలో బీసీలకు ప్రాధాన్యం


భీమవరంలో గూడూరి ఉమాబాలకు పుష్పగుచ్ఛం అందిస్తున్న బాలకృష్ణ, మంగరాజు తదితరులు

భీమవరం: నరసాపురం పార్లమెంట్ టికెట్‌ను తొలిసారిగా బీసీ మహిళకు ఇవ్వడం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్నమండ బాలకృష్ణ అన్నారు. గురువారం భీమవరంలో వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాలను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం బాలకృష్ణ మాట్లాడుతూ గతంలో ఎన్నడులేని విధంగా ఏలూరు, నరసాపురం పార్లమెంట్ టికెట్స్‌ను బీసీలకు ఇవ్వడం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బీసీ పట్లచూపుతున్న మమకారానికి నిదర్శనమన్నారు. బీసీలంతా ఐక్యమత్యంగా వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేసి ముఖ్యమంత్రిగా జగన్‌ను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటమిల్లి మంగరాజు, ఏసుపాదం, పాల రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న రథోత్సవాలు


దిగమర్రులో రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక యడ్లబజారు సెంటర్‌లో ఉన్న శ్రీ కనకదుర్గా మల్లేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారి రథోత్సవం అత్యంత వైభవంగా సాగింది. ఉదయం అమ్మవారికి వేద పండితులు వేద పారాయణం, కుంకుమపూజలు నిర్వహించారు. రాత్రి పట్టణ ఊరేగింపులో భాగంగా ముందుగా వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ పరిశీలకులు గుణ్ణం నాగబాబు, రాజరాజేశ్వరి, గుణ్ణం సుభాష్, విజయదీప్తి దంపతులు అమ్మవారికి కుంభం ఏర్పాటు చేశారు. అనంతరం రథం లాగి ఊరేగింపును ప్రారంభించారు. వివిధ సన్నాయి వాయిద్యాలతో, గరగల నృత్యాల, తీన్‌మార్ డప్పులు, కేరళ వాయిద్యాలతో అమ్మవారి ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు చైర్మన్ కావలి శ్రీనివాసరావు, క్షీరారామ లింగేశ్వరస్వామి ఆలయ చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, సభ్యులు దాసరి దివ్యశ్రీ, రేలంగి నరసింహరావు, ఎం.మంగాకుమారి, టి.శ్రీరాములు, జి.అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలి: మండలంలోని ఏనుగువానిలంక గ్రామంలో పార్వతీ మల్లేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి ఆలయ అర్చకులు కామలింగశాస్త్రి, సురేంద్రశర్మ బ్రహ్మత్వంలో దేవేరులకు కల్యాణం నిర్వహించారు. కల్యాణోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ కాకుమళ్ల ఆంజనేయులు దంపతులు పార్వతీ మల్లేశ్వర స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కల్యాణం అనంతరం గురువారం రథోత్సవం నిర్వహించారు. శివాలయం నుంచి ప్రారంభమైన రథోత్సవం గ్రామ ప్రధాన వీధుల మీదుగా సాగి మళ్లీ శివాలయానికి చేరుకుంది. రథోత్సవం జరుగుతున్న సమయంలో స్వామిని దర్శించుకున్న పాలకొల్లు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) కొంత సమయం రథం లాగి స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఐదు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయని ఐదవ రోజున అన్నసమారాధనతో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ చైర్మన్ కాకుమళ్ల ఆంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో యడ్ల తాతాజీ, వినుకొండ రవి, బళ్ల నాగేశ్వరరావు, పెచ్చెట్టి కృష్ణాజీ, గొలికారి తాతాజీ వెంకట నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు అర్బన్: మండలంలోని దిగమర్రులో ఉన్న శ్రీ ఉమాసోమేశ్వర స్వామివార్ల కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం గ్రామంలో రథోత్సవం నిర్వహించారు. కల్యాణ మూర్తుల ప్రతిమలను రథంలో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ఈవో యాళ్ల సూర్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.


కనకదుర్గమ్మకు నైవేద్యం సమర్పిస్తున్న గుణ్ణం నాగబాబు కుటుంబ సభ్యులు


ఏనుగువానిలంకలో రథోత్సవంలో పాల్గొన్న గుడాల శ్రీహరి గోపాలరావు

అంబేడ్కర్ ఆశయాలు అమలు చేయాలి


చినమల్లంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పుష్పరాజ్

పెనుగొండ: ప్రభుత్వాలు భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు అమలు చేసి, దళితుల ఆర్థిక పరిపుష్టి ఉండేలా చర్యలు తీసుకోవాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ అన్నారు. గురువారం చినమల్లంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దళితవాడలకు ఖర్చు చేయాల్సిన నిధులను వృథా చేయకుండా ఆయా దళిత వాడల్లో మౌలిక సదుపాయాలు కల్పించినపుడే అంబేడ్కర్ ఆశయాలు అమలు చేసినట్లువుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి నన్నేటి నాగరాజు, జిల్లా ఉద్యోగ సంఘాల అధ్యక్షుడు నేతల సాల్మన్ రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి కోలాటి ప్రసాదరావు, తాళ్లూరి సందీప్, అడ్డాల నాని పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్య ఉచిత శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ఆకివీడు: వృత్తి నైపుణ్య ఉచిత శిక్షణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మండలంలోని దుంపగడప వీవీ.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పరీక్షలు రాసిన విద్యార్థులకు సువర్ణావకాశం కల్పిస్తూ నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. డేటా ఎంట్రీ కోర్సు, టైలరింగ్‌లో మహిళలకు 3 నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తి అయిన అనంతరం ప్రభుత్వం గుర్తింపుతో సర్టిఫికెట్ అందజేస్తారని చెప్పారు.

ప్రచారపర్వం ఆసక్తికరం


నరసాపురం: పట్టణంలోని 26వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ ప్రసాదరాజు


పెనుమంట్ర: ఓడూరులో వృద్ధురాలితో మాట్లాడుతున్న మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు

నరసాపురం, పాలకొల్లు ఆచంట నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థులు గురువారం ప్రచారం నిర్వహించారు. సంక్షేమంతో పాటు అభివృద్ధి చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అండగా ఉండాలని ప్రజలను కోరారు. -సాక్షి నెట్‌వర్క్

యలమంచిలి: బాడవలో వికలాంగుడితో మాట్లాడుతున్న గుడాల శ్రీహరి గోపాలరావు →



క్యాన్సర్‌పై అవగాహన


క్యాన్సర్ నివారణపై అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ కె.సుజాత

ఆకివీడు: ముందు జాగ్రత్త చర్యలతో క్యాన్సర్‌ను నివారించవచ్చునని ప్రిన్సిపాల్ కె.సుజాత చెప్పారు. మండలంలోని దుంపగపడ గ్రామంలోని బోస్ కాలనీలో ఎన్ఎస్ఎస్ శిబిరం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల్లో అధికంగా గర్భసంచి, బ్రస్టు, బ్లడ్, గొంతు క్యాన్సర్‌లు వస్తాయని వివరించారు. పరిశుభ్రతతో, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలన్నారు. కెమిస్ట్రీ అధ్యాపకురాలు ఏ.ఇందిర మాట్లాడుతూ క్యాన్సర్ కు మందులేదని, నివారణే మార్గమన్నారు. క్యాన్సర్ లక్షణాల్ని గుర్తించి వెంటనే వైద్యం పొందాలన్నారు. క్యాన్సర్ వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటే ప్రాణాపాయం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో భౌతిక శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ పి.అనిల్ సాయి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కె.ఆనందకుమార్ తదితరులు పాల్గొన్నారు.